నేటి సాక్షి TGTEL/25/A1737
కరీంనగర్
బుధవారం
25 మార్చి 2026

## బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీజీవీపీ (బిఆర్ఎస్వీ) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో, గన్నేరువరం మండలంలో బీఆర్ఎస్ యువజన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంగళవారం తెల్లవారుజామునే పోలీసులు రంగంలోకి దిగి యువజన నాయకులు బోయిన కుమార్, పాలెపు అజయ్, సమ్మెట అనిల్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులతో విద్యార్థులు, యువకుల గొంతు నొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. స్వేచ్ఛగా నిరసనలు తెలుపుకోవచ్చని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి వచ్చి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇటువంటి నిర్బంధాల ద్వారా ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత నుండి తప్పించుకోలేదని వారు హెచ్చరించారు. ప్రభుత్వం ఇకనైనా మొండివైఖరి వీడి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యబద్ధంగా సాగే పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### 11 మంది అరెస్ట్



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. నర్వ పోలీసులు మరియు టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడుల్లో 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నర్వ ఎస్సై పబ్బతి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారి వద్ద నుండి రూ. 1,22,900 నగదుతో పాటు, 9 మోటార్ సైకిళ్లు, 11 సెల్ ఫోన్లు మరియు పేకాట సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మండల పరిధిలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని, ఎవరైనా జూదానికి పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై పబ్బతి రమేష్ హెచ్చరించారు.

## నెట్‌బాల్ లోగో ఆవిష్కరణ



**నేటి సాక్షి, నారాయణపేట, (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా అమెచ్యూర్ నెట్‌బాల్ అసోసియేషన్ (అన్న) నూతన లోగోను మంగళవారం హైదరాబాద్‌లోని నివాసంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీ వాకేటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి జిల్లాలో క్రీడల అభివృద్ధిపై చర్చించారు. ఈ లోగో ఆవిష్కరణతో జిల్లాలో నెట్‌బాల్ క్రీడకు నూతన జవజీవాలు వస్తాయని, క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్. రమేష్, కార్యదర్శి డాక్టర్ ఎం. రామ్ మోహన్ గౌడ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎస్. వెంకటేష్, రఘు పేట్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చెందిన లకాకుల తిప్పయ్య సతీమణి శైలజ మరణవార్త తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి, మరికల్ సర్పంచ్ గుప చెన్నయ్య, మండల అధ్యక్షులు బేలుగోంది వీరన్న తదితరులు శైలజ చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం, ఇటీవల కాలు ఆపరేషన్ చేయించుకున్న విలేఖరి వీరన్నను కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ హరీష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాటేకొండ ఆంజనేయులు, ఉపసర్పంచ్ కాజా, వార్డు సభ్యులు అశోక్, రవి, గోవర్ధన్, టైసన్ తదితరులు పాల్గొన్నారు.

# మందోటకు తరలిన పశువుల మంద

### 'నేటి సాక్షి' కథనానికి స్పందన



**నేటి సాక్షి, ఎండపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారానికి పత్రికలు వేదికగా నిలుస్తున్నాయని చర్లపల్లి గ్రామ ఘటనతో మరోసారి స్పష్టమైంది. గ్రామంలోని నడిబొడ్డున పశువుల మంద వల్ల ఏర్పడుతున్న సమస్యలపై 'నేటి సాక్షి'లో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ పాలకవర్గం తక్షణమే స్పందించింది. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పశువుల మందను ఊరి బయట ఉన్న మందోటకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామంలో సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి ఆధ్వర్యంలో పాడి రైతులు, గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఇకపై నడి ఊరిలోని మర్రిచెట్టు వద్ద పశువులను నిలిపివేయకుండా, తప్పనిసరిగా మందోట వద్దనే ఉంచాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిబంధనలను ప్రతి పశు యజమాని పాటించాలని గ్రామంలో డప్పు చాటింపు (దండోరా) ద్వారా కూడా ప్రకటించారు. ప్రతిరోజూ మర్రిచెట్టు వద్ద పశువులను సమూహంగా నిలిపివేయడం వల్ల దుర్వాసన, మురుగు, దోమలు, ఈగల సమస్యలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గ్రామ పంచాయతీ పాలకవర్గం పేర్కొంది. పంచాయతీ కార్యదర్శి తిరుపతి రెడ్డి సహకారంతో పశువుల మందను పూర్తిగా మందోటకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ నిర్ణయంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి బాటలు వేసిన 'నేటి సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నేటి సాక్షి, కొడిమ్యాల :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో 1983-84 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల మూడవ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా బాల్య మిత్రులందరూ స్థానిక శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన సభలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాసెట్టి రఘునందన్ రావు మాట్లాడుతూ.. 2019లో ఈ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నప్పటి నుండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఏడేళ్లుగా పేదలను ఆదుకోవడంలో తమ సంఘం ముందుందని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోల్ ఇండియాలో మొదటి మహిళా మైనింగ్ ఇంజనీర్‌గా గుర్తింపు పొంది, ప్రస్తుతం అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న అంకం అఖిల సాహితీని (సంఘ సభ్యులు అంకం జనార్దన్-పద్మల కుమార్తె) సంక్షేమ సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అలాగే పదోన్నతులు పొందిన పలువురు ఉద్యోగస్తులను కూడా అభినందించి సన్మానించారు. అంతకుముందు మరణించిన తోటి విద్యార్థుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంఘం పదవీ కాలం ముగియడంతో పాత కమిటీనే కొద్దిపాటి మార్పులతో ఏకగ్రీవంగా తిరిగి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గుర్రం భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి బాసెట్టి రఘునందన్ రావు, ఉపాధ్యక్షురాలు సి. హెచ్. వెంకటలక్ష్మి, కార్యదర్శి శైలజ, సాగి సతీష్ రావు, కొడిమ్యాల ఉపసర్పంచి గుర్రం నరసయ్య, అంకం జనార్ధన్, కంచర్ల గంగాచారి, చిన్నమనేని మహేందర్ రావు పాల్గొన్నారు. ఈ సమ్మేళనానికి సుమారు 150 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

## చెత్తబుట్టల పంపిణీలో వివక్ష



- **మున్సిపల్ కమిషనర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు**

**నేటి సాక్షి, గజ్వేల్ :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్తబుట్టల పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోందని, కేవలం ఒక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పీసీసీ కార్యదర్శి యాదగిరి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొనగారి రాజు, కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్ నాయక్ తదితరులు కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పాలకవర్గం రూ. 10 లక్షలు, ప్రస్తుత పాలకవర్గం రూ. 5 లక్షలు కలిపి మొత్తం రూ. 15 లక్షల విలువైన చెత్తబుట్టలను కొనుగోలు చేశారని తెలిపారు. ఈ బుట్టలను అన్ని వార్డుల్లోని ఇళ్ల యజమానులకు, అద్దెదారులకు సమానంగా పంపిణీ చేయాల్సి ఉండగా, అధికార బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉండేవారికి మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తమకు నచ్చిన వారికే వీటిని పంచుతున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని మండిపడ్డారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి ఉండగా, గతంలో కేవలం బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల వద్దే శుభ్రం చేశారని విమర్శించారు. ఇకపై ప్రతి ఇంటి వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, వెంటనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సమీర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జహీర్, కప్ప భాస్కర్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ఎంఈఓపై చర్య తీసుకోవాలి

- **యుఎస్ఎఫ్ఐ డిమాండ్**

**నేటి సాక్షి, గజ్వేల్ :** గజ్వేల్ పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మండల విద్యాధికారి (ఎంఈఓ)పై తక్షణమే చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిద్ధిపేట జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తాటికొండ రవి మాట్లాడుతూ.. గజ్వేల్‌లోని సాయి జీడీఆర్, జీడీఆర్ వంటి ప్రైవేట్ పాఠశాలల పట్ల ఎంఈఓ పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు నియంత్రణ నిబంధనలను బేఖాతరు చేస్తూ సదరు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నా, కనీస మౌలిక వసతులు లేకపోయినా అధికారి మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారని, ఇలాంటి ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాల్సిన ఎంఈఓ తటస్థంగా ఉండకుండా ప్రైవేట్ యాజమాన్యాలకు మద్దతుగా నిలుస్తున్నారని మండిపడ్డారు. విద్యను వ్యాపారంగా మార్చే ప్రయత్నాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని, అధికారులు నియమాలను పక్కనబెడితే సామాన్య ప్రజలకు న్యాయం జరగదని అన్నారు. ఎంఈఓ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నాచారం శేఖర్, గుడికందుల రవి పాల్గొన్నారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్
బుధవారం
25 మార్చి 2026

# సహారా బాధితుల డబ్బులు వెంటనే చెల్లించాలి



**నేటి సాక్షి, సిరిసిల్ల, (శివకుమార్):** సహారా ఇండియా గ్రూప్ కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేసిన బాధితులందరికీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ.. కోట్లాది మంది సామాన్యులు తమ అవసరాల కోసం సహారాలో పొదుపు చేసుకున్నారని, కానీ గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏడాదిలోపు డబ్బులు చెల్లించాల్సి ఉన్నా, కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలు, షరతులు పెడుతూ బాధితులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేవలం రూ. 10 వేల నుండి 50 వేల లోపు ఉన్నవారికే కాకుండా, డిపాజిట్ చేసిన వారందరికీ వెంటనే పూర్తి నగదు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జవ్వాజి విమల, కోడం రమణ, బాధితులు వీరేశం, నందం, లక్ష్మీపతి, కవిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

- ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్, 14న అంబేద్కర్ జయంతి



**నేటి సాక్షి, రాజన్న సిరిసిల్ల,(శివకుమార్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (×ణూజ)లో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో మహనీయులు అందించిన విశేష సేవలను స్మరించుకునేందుకు ఏటా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 5న బాబు జగ్జీవన్ రామ్, 14న అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లోని వారి విగ్రహాల వద్ద పారిశుధ్య పనులు ప్రతి రోజూ చేయించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వసతులను పర్యవేక్షించేందుకు మండల మరియు జిల్లా స్థాయి అధికారులను నియమించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, జిల్లా వైద్యాధికారి రజిత, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ శానిటేషన్‌కు ఉపయోగించే వాహనాల పరిశీలన

- మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్



**నేటి సాక్షి, జగిత్యాల టౌన్,(పూరెళ్ల బాపు):** ఈ సందర్భంగా కొత్త బస్ స్టాండ్ వాటర్ ట్యాంకర్ వద్ద మరమ్మతులు లేక ఉన్న వాహనాలను కౌన్సిలర్ లతో పరిశీలించారు., అనంతరం ఆమె మాట్లాడుతూ తరచు మున్సిపల్ వాహనములు మరమ్మతుకు గురవడం పై సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు., వాహనాల్లో తరచూ ఆయిల్ చేంజ్ సకాలంలో చేస్తూ మెయింటెనెన్స్ చేయాలని ఆదేశించారు. పట్టణ శానిటేషన్ లో వాహనములు చాలా కీలకమని 100% ఇంటింటి చెత్త సేకరించాలని ఆదేశించారు. ప్రస్తుతం రిపేర్ చేయవలసిన వాహనంలో సకాలంలో మరమ్మతులు చేయించి వినియోగం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అరవ లక్ష్మి, జుంబర్తి గంగా లక్ష్మి రాజ్ కుమార్, చీటి లక్ష్మీనారాయణ, కూతురు రాజేష్, పిట్ట ధర్మరాజు, దుమాల రాజ్ కుమార్, డి ఈ ఆనంద్, ఏ ఈ లక్ష్మి, అనిల్, సానిటరీ ఇన్స్పెక్టర్ లత, రాము మరియు అధికారులు ఉన్నారు.

# ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం

**నేటి సాక్షి, జగిత్యాల టౌన్, (పూరెళ్ల బాపు):** ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ (ణవీ&ూ) ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ , మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయవ్యాధి (TB) పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, సమయానికి పరీక్షలు చేయించుకొని సరైన చికిత్స తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా ుదీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని ఆయన పేర్కొన్నారు.ుదీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలను పాటించడం ద్వారా వ్యాధిని త్వరగా నియంత్రించవచ్చని అన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో అవగాహన పెంపొందించడమేనని తెలిపారు. ుదీ లక్షణాలు, నివారణ చర్యలు, ఉచిత పరీక్షలు మరియు చికిత్సపై వైద్య అధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్ లు పాల్గొని ప్రజలకు సందేశాన్ని చేరవేశారు. ఈ కార్యక్రమంలో ణవీ&ూ డా. సుజాత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డకు సర్పంచ్ కానుక



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని మాదాపూర్ గ్రామంలో సర్పంచ్ మాధరి శ్రీనివాస్ తన ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారు. గ్రామానికి చెందిన కళ్లెం సంకీర్తన–అంజిరెడ్డి దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించిన సందర్భంగా, మంగళవారం ఆయన వారి నివాసానికి వెళ్లి 'మహాలక్ష్మి కానుక'గా రూ. 5,016 నగదును అందజేశారు. గ్రామంలో ఆడబిడ్డ పుడితే తన వంతుగా ఆర్థిక సాయం అందిస్తానని గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ కానుకను అందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్లెం ముత్యం రెడ్డి, మాడుగుల కరుణాకర్ రెడ్డి, ఆసరి శ్రీనివాస్, పర్శరాములు, బండి తిరుపతి, కాంతాల రాజిరెడ్డి, సుంకరి రమేష్, శ్రీనివాస్ రెడ్డి, కత్తి ఆంజనేయులు, గొడుగు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా పసుపుల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం విజయవంతంగా జరిగింది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పశువైద్య శిబిరంలో గ్రామ సర్పంచ్ జె. నర్మద రవికుమార్ గౌడ్, ఉపసర్పంచ్ బి. మహేష్ కుమార్ సమక్షంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు మాట్లాడుతూ.. రైతులు తమ పశువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుండి కాపాడుకోవచ్చని సూచించారు. ఈ శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వర్ రెడ్డి, డాక్టర్ మహాదేవప్ప, డాక్టర్ వాసుదేవుడు, నర్సింహులు, శ్రీకాంత్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కంచర్ల రవి గౌడ్ ముందస్తు అరెస్ట్



**నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్):** 'చలో అసెంబ్లీ' ముట్టడి పిలుపు నేపథ్యంలో టీజీవీపీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్‌ను పోలీసులు మంగళవారం వేకువజామున ముందస్తుగా అరెస్టు చేశారు. విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడటం దారుణమని రవి గౌడ్ మండిపడ్డారు. అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి వచ్చి నాయకులను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ అరెస్టు అయిన వారిలో నాయకులు ఎస్.కె. అఫ్రోజ్, ఎండి. అజ్జు, మట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# సిరిసిల్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**నేటి సాక్షి, సిరిసిల్ల, (శివకుమార్):** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని నిరసిస్తూ ఏబీవీపీ సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చేనేత విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ లోపల్లి రాజు రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని, బడ్జెట్‌లో 15 శాతం నిధులు కూడా కేటాయించకపోవడం దారుణమని మండిపడ్డారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిధుల లేమితో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ ఇన్చార్జి పూజ కార్తీక్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కేసరి శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫన్ కిషోర్, వంశీకృష్ణ, సాయి నిఖిల్, అరుణ్, లావణ్య, శృతి, స్వాతి, పావని తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరం కావాలి




- గజ్వేల్ రన్నర్స్ లోగోను ఆవిష్కరించిన సిద్దిపేట సి.పి.
- ఆరోగ్యకరమైన సమాజం కోసం వ్యాయామం, యోగా అవసరం

**నేటి సాక్షి, గజ్వేల్:** యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయంలో 'గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్' లోగోను, గజ్వేల్ ప్రోమో రన్ వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సి.పి. మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో వ్యాయామం, యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. గజ్వేల్ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రోమో రన్ కార్యక్రమానికి పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను అంధకారం చేసుకోకుండా, క్రీడలు మరియు పరుగు వంటి సానుకూల అలవాట్లను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు మరియు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



- మార్చి 28న జాతీయ లోక్ అదాలత్.. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పిలుపు
- రాజీ మార్గంలో కేసుల పరిష్కారం.. సమయం, ధనం ఆదా

**నేటి సాక్షి, వికారాబాద్ :** ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, సులభంగా పరిష్కరించుకునేందుకు ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె ఈ మేరకు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను పరస్పర రాజీ ద్వారా తక్కువ సమయంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ట్రాఫిక్ చలానాలు, చిన్న చిన్న వివాదాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ మరియు కుటుంబ సమస్యలను ఇక్కడ స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల కోర్టుల చుట్టూ తిరిగే ఇబ్బందులు తప్పడమే కాకుండా, కక్షిదారులకు సమయం, వ్యయం రెండూ ఆదా అవుతాయని వివరించారు. పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకుని శాంతియుత వాతావరణాన్ని పెంపొందించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# తర్తూరు జాతరలో భక్తులకు వసతులు కల్పించాలి



- అక్రమ వసూళ్లు, మద్యం బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి
- ఆలయ అభివృద్ధిలో అధికారులు విఫలం: సీపీఐ నేత రమేష్ బాబు

**నేటి సాక్షి, జూపాడుబంగ్లా :** జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జాతర ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరలో ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ కోసం టెంట్లు, మెడికల్ క్యాంపులు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏటా రూ. 10 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా, కనీసం ఆలయానికి రంగులు వేయలేదని, గోడలు పగుళ్లు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జాతర సాకుతో వ్యాపారుల వద్ద అక్రమ పన్ను వసూళ్లు చేస్తే ఊరుకునేది లేదని, అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అవినీతికి తావులేకుండా జాతరను జరిపించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిని నియమించాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గిత్తకు ఆహ్వాన పత్రిక



- శ్రీ రంగనాథస్వామి రథోత్సవం, శ్రీరామ నవమికి ఆహ్వాన పత్రిక

**నేటి సాక్షి జూపాడుబంగ్లా:** నందికొట్కూరు నియోజకవర్గం జూపాడు బంగ్లా మండలంలోని తుడిచేర్ల, గ్రామం, కనకయ్య కొట్టాల గ్రామాల ప్రజలు సంయుక్తంగా నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు మరియు తర్తురు గ్రామంలో ,శ్రీ శ్రీ శ్రీ తర్తురు రంగనాథస్వామి రథోత్సవ తిరుణాలకు, టిడిపి నాయకులు రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, రమణారెడ్డి, నారాయణరెడ్డి, దొరబాబు రెడ్డి, కడియం పుల్లన్న యాదవ్, కాగుల శంకర్ యాదవ్, కొట్టు పుల్లయ్య, మహంకాళి గురువయ్య, జంపాల నారాయణ, కొత్తపేట నారాయణ గారు, నందికొట్కూరు శాసనసభ్యులు శ్రీ గిత్త జయసూర్య గారిని హృదయపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# అక్రమ రవాణాపై టాస్క్ ఫోర్స్ పంజా

**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ రవాణాపై టాస్క్ ఫోర్స్ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ ఎస్‌కే.అన్వర్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో గత వారం రోజుల వ్యవధిలో మొత్తం 13 అక్రమం రవాణా కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ సంధార్భంగా యాలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 08 ట్రాక్టర్లను , కరణ్ కోట్ ప్రాంతంలో అక్రమంగా కలప రవాణా చేస్తున్న 1 లారీని పట్టుకొని సీజ్ చేయడం జరిగింది. గత వారం రోజుల క్రితం నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రమట్టి అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న 3 లారీలు సీజ్ చేసి ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలలో కేసులు నమోదు చేయడం జరిగింది.

జిల్లాలో అక్రమ రవాణా కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ తెలిపినారు. ఎక్కడైనా అనుమానాస్పద రవాణా కనిపించిన వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, రాత్రి పూటలు సహా నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమంగా సహజ వనరులను తరలించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

ఈ సంవత్సరంలో ఇప్పటివరకు టాస్క్ ఫోర్స్ అధికారులు జనవరి నెలలో 22 అక్రమ రవాణా కేసులు, ఫిబ్రవరి నెలలో 9 అక్రమ రవాణా కేసులు, మార్చి నెలలో 20 మొత్తం ఈ సంవత్సరం 51 అక్రమ రవాణా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.



# చీర్లవంచలో ఉచిత వైద్య శిబిరం



**నేటి సాక్షి, రాజన్న సిరిసిల్ల,(శివకుమార్):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం చీర్లవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కిరణ్మయి, ఉప సర్పంచ్ మచ్చ శేఖర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శరణ్య నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో నేత్ర, దంత, ఎముకల వ్యాధులు మరియు జనరల్ ఫిజీషియన్ విభాగాల్లో నిపుణులైన వైద్యులు రోగులకు చికిత్స అందించారు. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్ మరియు గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులపై మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 221 మంది రోగులను పరీక్షించి, వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, సూపర్వైజర్ రాజు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు షీ టీమ్ అవగాహన

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన.. ఎస్పీ నితిక పంత్ ఆదేశం



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ పట్టణంలోని అబ్దుల్ కలాం పాఠశాలలో మంగళవారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హసన్, షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్సై భిక్కలాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై భిక్కలాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మొబైల్ ఫోన్ల మితిమీరిన వినియోగం వల్ల చదువు దెబ్బతినడమే కాకుండా ఆరోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. ముఖ్యంగా చిన్నారి బాలికలకు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్' అంశాలపై అవగాహన కల్పిస్తూ ఆత్మరక్షణ పద్ధతులను వివరించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే ధైర్యంగా షీ టీమ్‌ను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు స్వప్న, రజని, వరలక్ష్మి, దినేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల రక్షణ చట్టంపై హర్షం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లికి కృతజ్ఞతలు



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** రాష్ట్ర అసెంబ్లీలో 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' (న్యాయవాదుల రక్షణ చట్టం) బిల్లును ఆమోదించడం పట్ల టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్, న్యాయవాది జేరుపోతుల మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ చట్టం తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రివర్గానికి మరియు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, కొన్ని సందర్భాల్లో హత్యలు కూడా జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల తరపున న్యాయం కోసం పోరాడే క్రమంలో ప్రత్యర్థి వర్గాల నుండి ఎదురయ్యే బెదిరింపులు, దాడుల నుండి ఈ చట్టం న్యాయవాదులకు పూర్తి రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ బిల్లు వల్ల న్యాయవాదులపై దాడులు చేసే వారికి కఠిన శిక్షలు అమలు అయ్యే అవకాశం ఉంటుందని, ఇది న్యాయవాద వృత్తికి గొప్ప భరోసా అని మహేందర్ కొనియాడారు.

# జింకల గూడెంలో తీరిన నీటి కష్టాలు

## సయ్యద్ ఇమామ్ ఆర్థిక సహకారంతో తాగునీటి బోర్ ఏర్పాటు




**నేటి సాక్షి, తిరుమలాయపాలెం,(రుద్రరాజు):** మండల పరిధిలోని గోల్ తండా గ్రామపంచాయతీ శివారు జింకల గూడెం గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రేటర్ ఇన్ఫ్రా సి.ఎం.డి., హాజి సయ్యద్ మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ ఇమామ్ తన సొంత ఖర్చుతో గ్రామంలో బోర్ వేయించి గ్రామస్తుల నీటి ఇబ్బందులను తీర్చారు. గ్రామంలో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని గమనించిన సయ్యద్ ఇమామ్ స్పందించి బోర్ వేయించగా, అది విజయవంతమై నీరు పడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ సుజాత అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామస్తుల కష్టాలను గుర్తించి అండగా నిలిచిన సయ్యద్ ఇమామ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ చందు, చారిటబుల్ ట్రస్ట్ కో-చైర్మన్ సయ్యద్ సిలార్, సయ్యద్ మదార్, షేక్ కరీం, వార్డు సభ్యులు సయ్యద్ జాఫర్, సయ్యద్ హుస్సేన్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్షయ రహిత సమాజమే లక్ష్యం



- ప్రపంచ టీబీ దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్
- రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ.. ప్రతిజ్ఞ చేయించిన డీఎంహెచ్ఓ

**నేటి సాక్షి, వికారాబాద్:** ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ ఐడీఓసీ కాంప్లెక్స్ వద్ద భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి ప్రారంభించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ టి. స్వర్ణకుమారి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులకు యజ్ఞ ఫౌండేషన్ సహకారంతో పోషకాహార కిట్లను అందజేశారు. డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి మాట్లాడుతూ.. గాలి ద్వారా వ్యాపించే ఈ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, 6 నుండి 8 నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహావీర్ వైద్య కళాశాల విద్యార్థులు, బృంగి పాఠశాల విద్యార్థులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు జీవనన్న గుడ్ బై

- నేడు కార్యకర్తలతో కీలక భేటీ.. 40 ఏళ్ల అనుబంధం ముగిసేనా?
- బుజ్జగించినా తగ్గని పట్టుదల.. గులాబీ గూటికి సీనియర్ నేత

**నేటి సాక్షి, జగిత్యాల టౌన్, (పూరెళ్ల బాపు):** జగిత్యాల రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకగా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో అత్యంత కీలక నిర్ణయానికి సిద్ధమయ్యారు. పార్టీలో గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు, అవమానాలు మరియు వివక్షతో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన, బుధవారం (మార్చి 25న) తన అనుచరులు, కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీలో ఆయన కాంగ్రెస్ వీడటంపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. జీవన్ రెడ్డి నిర్ణయాన్ని మార్చుకోవాలని మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వయంగా జగిత్యాలకు వచ్చి భేటీ అయ్యారు. అంతకుముందు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా చర్చలు జరిపారు. అయితే, "ఇక కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు" అని జీవన్ రెడ్డి వారికి ఖరాఖండిగా చెప్పేసినట్లు సమాచారం. తన ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టి పార్టీలో ఉండలేనని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యత పెరగడం, మున్సిపల్ పదవుల కేటాయింపులో తన వర్గానికి అన్యాయం జరగడం జీవన్ రెడ్డిని కలచివేసింది. గత 20 నెలలుగా తాను మానసిక క్షోభ అనుభవిస్తున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అనుచరులు ఇప్పటికే సోషల్ మీడియా డీపీలు మార్చడం, ఫ్లెక్సీలు తొలగించడం వంటి చర్యలతో పార్టీ మార్పు సంకేతాలిస్తున్నారు. ఆయన బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. 1981లో సమితి అధ్యక్షుడిగా మొదలై ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసిన ఈ సీనియర్ నేత అడుగులు ఎటువైపు పడతాయోనని రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.



# చౌడేపల్లిలో ఘనంగా ప్రపంచ టీబీ దినోత్సవం





**నేటి సాక్షి, చౌడేపల్లి :** క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో లీల మాధవి, మండల వైద్యాధికారిణి మోనా పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రమైన చౌడేపల్లిలో మండల ఆరోగ్య శాఖ మరియు సచివాలయ అధికారుల ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో టీబీ వ్యాధిపై ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని, లక్షణాలు ఉన్నవారు ఈ

- క్షయ రహిత సమాజమే లక్ష్యం
- ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎంపీడీవో లీల మాధవి

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారానే దానిని పూర్తిగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గఫూర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ముదిరాజ్ భవనం.. ముగియని ఎదురుచూపు



- ఎన్నికల హడావిడిలోనే శంకుస్థాపన.. అభ్యర్థి ఓటమితో అటకెక్కిన హామీ
- కుంట శిఖంలో నిర్మాణంపై కలెక్టర్ సీరియస్.. నిలిపివేసిన అధికారులు

**నేటి సాక్షి, తిమ్మాపూర్:** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్‌లో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం రాజకీయ చదరంగంలో చిక్కుకుంది. ఎన్నికల సమయంలో ఓట్ల వేటలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ, ఇప్పుడు నీటి మూటగా మారింది. కార్పొరేషన్ ఎన్నికల వేళ ముదిరాజ్ కులస్థులకు భవనం నిర్మిస్తానని మాట ఇచ్చిన ఎమ్మెల్యే, తీరా కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడంతో ఆ ఊసే ఎత్తడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అలుగునూర్ కుంట శిఖం (బఫర్ జోన్)లో ఎలాంటి అనుమతులు లేకుండానే ఎమ్మెల్యే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఫలితాల్లో అధికార పార్టీ అభ్యర్థి ఓడిపోవడంతో భవన నిర్మాణ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీనికి తోడు కుంట శిఖంలో నిర్మాణాలు ఎలా చేపడతారని జిల్లా కలెక్టర్ సీరియస్ కావడంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి పనులను అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసి కూడా కేవలం ఓట్ల కోసమే ఎమ్మెల్యే భూమిపూజ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, ఆ తర్వాత విస్మరించడం సదరు నాయకుడికి అలవాటుగా మారిందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. మరి అర్ధాంతరంగా నిలిచిన ఈ భవనం భవిష్యత్తు ఏమవుతుందో వేచి చూడాలి.




# ఉచిత కంటి పరీక్ష

## 13 మందికి శస్త్రచికిత్సలు



**నేటి సాక్షి, కొమురం భీం ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి–చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిత నేతృత్వంలో జరిగిన ఈ శిబిరానికి 27 మంది హాజరు కాగా, వారిలో 12 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత వారం పరీక్షల్లో ఎంపికైన 13 మంది క్యాటరాక్ట్ బాధితులను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజన వసతి కల్పించి శస్త్రచికిత్సల నిమిత్తం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా వేల మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించామని, ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్ధి పొందిన వారు ఇతరులకు కూడా ఈ సేవల గురించి వివరించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, గోపి మరియు కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

# నేత్ర శిబిరానికి విశేష స్పందన



**నేటి సాక్షి, మెట్‌పల్లి:** మల్లాపూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శ్రీ కనకసోమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై అనిల్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు రేవెల్లి తిరుపతి మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేయడం తమ సంస్థ లక్ష్యమని, ఈ శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు. శిబిరంలో సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 60 మందిని తదుపరి చికిత్సల కోసం ఎంపిక చేశారు. ఇదే సందర్భంలో పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెట్‌పల్లి అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాగేష్, ముద్దం ప్రసాద్ గౌడ్, సర్పంచ్ చిట్టాల లక్ష్మణ్ మరియు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్

## గన్నేరువరం మండల శాఖ అధ్యక్షుడు గా శ్రీరాముల నరేందర్




**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల శాఖ అధ్యక్షుడు గా శ్రీరాముల నరేందర్ , ప్రధాన కార్యదర్శి గా ఉప్పునూటి రవి ఎస్ జిటి ప్రాథమిక పాఠశాల రంగనాయక పల్లి గార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి తాళ్లపల్లి తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు, ఎన్నికల పరిశలకులు గా కానుగంటి రాజమౌళి రాష్ట్ర కౌన్సిలర్ గార్లు తెలిపారు. కానిగంటి రాజమౌళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వకంగా ఉంటున్నా అని చెబుతూ మభ్యపెడుతూ ఉన్నది. పెండింగ్లో ఉన్న డి ఏ లను వెంటనే విడుదల చేయాలని,నూతన పిఆర్సి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, గత సంవత్సరం ఎస్ఎస్సి స్పోట్ వాల్యుయేషన్ చేసిన ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం




**నేటిసాక్షి, తిరుమలాయపాలెం,(మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా లో జరిగిన క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధర కు ఉత్తమ ప్రతిభ అవార్డు మరియు సర్టిఫికెట్ జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ సుబ్బారావు ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వేణు మాధవ్ చేతులమీదుగా సర్టిఫికెట్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలన దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో సామర్థవంతంగా అమలు చేయడం రోగులను గుర్తించి వెంటనే చికిత్స అందించడం రోగులకు అవగాహన కల్పించడం పూర్తి కోర్సు పూర్తి చేయించేలా కృషి చేయడం ద్వారా టీవీ నియంత్రణలో మంచి ఫలితాలు సాధించినట్లు నిరంతరం పర్యవేక్షణ కల్పించడం వంటి అంశాలలో సుబ్లేడ్ పిహెచ్‌సి డాక్టర్ వసుంధర చేసే సేవలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని, క్షయవ్యాధి నిర్మూలనలో ప్రతి ఆరోగ్య కార్యకర్త పాత్ర కీలకమని డాక్టర్ వసుంధర వంటి వైద్యులు చూపుతున్న అంకితభావం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.